ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 19.0


వీసీలో కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ఎస్పీ మేరీ ప్రశాంతి

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ : కలెక్టర్

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 16 : జిల్లాలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా ఎన్నికల నిర్వహిస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ సంసిద్ధతపై శుక్రవారం రాత్రి అమరావతి నుంచి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి ఎస్పీ మేరీప్రశాంతితో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ పాల్గొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి నెలాఖరులోగా పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తామని కలెక్టర్ వివరించారు. డీఆర్వో పుష్పమణి తదితరులు పాల్గొన్నారు.

ఎథికల్ ఓటింగ్ లక్ష్యంగా స్వీప్

ఏలూరు ఎడ్యుకేషన్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు పునాది వంటిదని, ఎథికల్ ఓటింగ్ లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వ హిస్తున్నామని డీపీవో, జిల్లా స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. స్వీప్ కార్యాచరణలో భాగంగా శుక్రవారం ఏలూరు సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల, కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, కైకలూరు, ఉంగుటూరు డిగ్రీ కళాశాలలో ఓటర్ల చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా స్వీప్ యాక్షన్ ప్రణాళిక అమలుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, పట్టణ ఓటర్లు పూర్తి స్థాయిలో ఓటింగ్ వెళ్లేలా ప్రోత్సహించడానికి అవగాహనా సదస్సులు నిర్వ హిస్తున్నట్టు డీపీవో తెలిపారు.


ట్రెజరీ కార్యాలయం వద్ద ఉద్యోగుల నినాదాలు

బకాయిలపై నిలదీద్దాం..

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోనే ఆర్థిక బకాయిల కోసం ప్రభుత్వంపై ఉద్యోగులు పోరాడి సాధించుకోవాలని ఏపీ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వివిధ బకాయిల కింద ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.23,250 కోట్ల చెల్లింపునకు జేఏసీ చేపట్టిన దశలవారీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్రవారం ఏలూరులోని ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నినాదాలు, ప్రదర్శన చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 20న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జేఏసీ సభ్య సంఘాల నాయకులు రవికుమార్, మస్తాన్ అలీ, శ్రీధర్‌రాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ గ్రీవెన్స్‌లో 14 అర్జీలు

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : ఉద్యోగులు స్వేచ్ఛగా, సమర్థవంతంగా పనిచేయడానికి ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం తోడ్పడుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించి ఉద్యోగుల నుంచి 14 వినతులను స్వీకరించారు. డీఆర్వో డి.పుష్పమణి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్ దివస్‌లో వినతులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16: పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్పీ మేరీ ప్రశాంతి చెప్పారు. పోలీస్ దివస్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ మేరీ ప్రశాంతి నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తున్న పలువురు పోలీస్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, హోంగార్డ్స్ హాజరై తమ సమస్యలు తెలిపారు. వాటన్నింటిని పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

19న పదోన్నతుల కౌన్సెలింగ్

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 16 : కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని హెచ్‌ఎం గ్రేడ్-2, సహోపాధ్యాయుల ఖాళీ పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేయడానికి అన్ని ప్రక్రియలను పూర్తిచేసి ఈనెల 19న ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులతో డీడీ సమక్షంలో సమన్వయ సమావేశం, అనంతరం పదోన్నతుల కోసం సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు గిరిజన ఉపసంచాలకులు పీవీఎస్ నాయుడు శుక్రవారం తెలిపారు. తుది సీనియారిటీ జాబితాను ప్రకటించామన్నారు.

అంతా మా ఇష్టం

అన్నింటా వైసీపీ నేతల పెత్తనం..

- శంకుస్థాపనలూ వారి చేతుల మీదే
- చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజాను పక్కనబెట్టి మరీ సిత్రాలు
- స్థానిక సంస్థల్లోనూ ఇష్టారాజ్యం.. కళ్లు మూసుకున్న యంత్రాంగం
- అసలు సమస్యలన్నీ తెరమరుగే .. ఎన్నికల వేళ బదిలీలతో ఇంకో సమస్య


కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెంలో గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న వైసీపీ చింతలపూడి ఇన్‌చార్జ్ విజయరాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, సిట్టింగ్ ఎంపీ కోటగిరి శ్రీధర్ తదితరులు

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎన్నికల వేళ సమస్యలు మరుగున పడుతున్నాయి. మాటలు కోటలు దాటుతున్నాయి. రాబోయే ఎన్నికల్లో కాబోయే వైసీపీ అభ్యర్థులు అప్పుడే ఎమ్మెల్యేలైనట్టు, ఎంపీ పీఠ మెక్కేసినట్టు అధికారికంగా శంకుస్థాపనలు, ప్రారం భోత్సవాలు చేసేస్తున్నారు. చింతలపూడి నియోజక వర్గంలో ప్రత్యేకించి ఈ తమాషా జరుగుతోంది. అక్కడ అధికార సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు లేదని తేల్చారు. ఆయన స్థానంలో పోటీ చేయబోయే అభ్యర్థిని ప్రకటించారు. ఎమ్మెల్యే పదవీ కాలం మరో రెండు నెలలు మిగిలి ఉండగానే ఏలూరు లోక్‌సభ వైసీపీ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి సమన్వయకర్త కె.విజయ రాజు రంగంలోకి దిగారు. అధికారులు దగ్గరుండి మరీ వీరిద్దరితో పునాదిరాళ్లు వేయిస్తూ ప్రారంభోత్సవాలు చేయిస్తున్నారు. ప్రభుత్వ నియమావళికి విరుద్ధంగా వీరిద్దరూ ఏకపక్షంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటుంటే జిల్లా యంత్రాంగం చూసీ చూడనట్టు వదిలేసింది. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే లేదా ఎంపీ లేదా జిల్లా, మండలస్థాయి అధికారులు చేయాల్సిన శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలను ఒక పార్టీ రంగేసుకున్న వ్యక్తులు ఎలా చేస్తారనే ప్రశ్నకు సమాధానం లేదు. వరుసగా రెండు మూడుసార్లు ఈ తరహా ఘటనలు పునరావృతమైనా అధికారులకు కనబడదు, వినబడదు. ఎందుకంటే అధికారపక్షం కాబట్టే.

అన్నింటినీ పక్కనబెట్టి..

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ తమ ప్రభుత్వం అన్నిటిపైనా స్పందిస్తోందని ఆ పార్టీ నేతలు కలరింగ్ ఇస్తున్నారు. అక్కడక్కడా పునాదిరాళ్లు, మందీ మార్బలం వెంటరాగా, ప్రభుత్వ కార్యక్రమాలపై ఊదర కొడుతు న్నారు. ఎప్పుడో గోతులూ గుంతలు పడిన రోడ్లకు కొన్ని చోట్ల మరమ్మతుల పేరిట హంగామా చేస్తున్నారు. అస లు సమస్యలను పక్కనబెట్టేశారు. రబీలో లక్షలాది ఎకరాలకు నీరందించాల్సిన పరిస్థితులపై సమీక్ష ఊసే లేదు. రబీ ఆలస్యంగా ఆరంభం కావడం, ఫిబ్రవరి రెండో వారం నాటికి గానీ నాట్లు పూర్తి కాకపోవడంతో నడి వేసవి నాటికి కోతకు వచ్చే అవకాశాలున్నాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయంటూ వాతావరణ శాఖ హెచ్చరికలుండగా, దీనికి అను గుణం గా గోదావరిలో నీటి లభ్యత, సరఫరా ఆసాంతం కొన సాగుతాయా లేదా అనే సందేహాలకు తావిచ్చింది. గతే డాదే నీటి సరఫరాలో అనేకచోట్ల ఆటంకాలు తొంగి చూశాయి. ముందుచూపుతో రైతులను రబీ వైపు కది లించాల్సి ఉండగా, ఎన్నికల ఏర్పాట్ల పేరిట అధికార యంత్రాంగం క్షణం తీరికలేకుండా గడుపుతోంది. ధాన్యం సేకరణ, రైతులకు నగదు చెల్లింపులు తదితర ఫిర్యాదులు ఇప్పటికే వచ్చి పడుతున్నాయి. వీటిపైన దృష్టే లేదు. టిడ్కో ఇళ్ల పేదలకు అందిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. జగనన్న లేఅవుట్లు, హౌసింగ్ కాలనీల్లో ఎడాపెడా సమస్యలు. ఊరూరా సచివాల యాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల కేంద్రాలు వీటన్నిటికీ సొంత భవనాలని ప్రకటించినా అనేకచోట్ల వాటి అడ్రసే లేదు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఇదే తీరు. ఎన్నికల వేళ సమస్య ఎంత తీవ్రమైనా పట్టించుకునే తీరిక అధికారులకు, ప్రజా ప్రతినిధులకు లేకపోయింది.

అంతా.. మారారు

దీర్ఘకాలంపాటు ఒకే జిల్లాలో పనిచేస్తున్న, ఎన్నికల విధులతో సంబంధం వున్న అధికారులందరికీ స్థానచల నం చేశారు. పొరుగు జిల్లా నుంచి రప్పించి వారికి పోస్టింగులు ఇచ్చారు. స్థానిక పరిస్థితులు తెలుసుకోవడానికి, అవగాహన రావడానికి సమయం పట్టనుంది. ఎన్నికలు జరిగేందుకు మరో 54 రోజులు గడువుండగా ఇప్పటికే పోలీస్, రెవెన్యూ సహా కీలక విభాగాల్లో అధికారులంతా అటూ ఇటూ బదిలీ అయ్యారు. వీరిలో అత్యధికులకు ఎన్నికల శిక్షణ ఆరంభమైంది. తహసీల్దార్లు, ఆర్డీవోలంతా విజయవాడ, విశాఖ శిక్షణా కేంద్రా ల్లో ఉన్నారు. రేపోమాపో గానీ వీరు స్వస్థలాలకు చేరుకోలేరు. ఆ తదుపరి జిల్లాస్థాయిలో ఎన్నికల ఏర్పాట్లకే వీరి సమయం సరిపోతుంది. ఈలోపు ఎక్కడి సమస్యలు అక్కడే. ప్రత్యేకించి నోటిఫికేషన్ వెలువడడానికి ఇంకా కొద్దిరోజులే గడువు మిగిలింది. ఆ తర్వాత వ్యవహారమంతా ఎన్నికల సంఘం చేతుల్లోకి వెళ్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అంతకంటే ముందుగానే ప్రభుత్వ కార్యాలయాల్లో తమ సొంత పనులు చక్కబెట్టుకోవడానికి అధికార వైసీపీ నేతల హడావుడి చేస్తున్నారు. నయానో భయానో పని పూర్తి కావాల్సిందేనంటూ కొన్ని శాఖాధిపతులపై తీవ్ర ఒత్తిడులు తెస్తున్నారు.

ఆందోళనలు.. ఆగ్రహావేశాలు

గడచిన రెండు మాసాలుగా ప్రభుత్వంపై వివిధ వర్గాల తిరుగుబాటు చేస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ వీధులకెక్కి సర్కారుతో కయ్యానికి సిద్ధపడుతున్నారు. తొలుత అంగన్ వాడీలు ఆ తర్వాత ఆశాలు ఇప్పుడేమో ప్రభుత్వోద్యోగులు ఏకబిగిన జగన్ సర్కార్‌పై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విభాగాలనినంటిలోనూ ఇప్పటికే నైరాశ్యం నెలకొంది. జగనన్నకు చెబుదాం .. పేరిట దరఖాస్తులైతే నమోద వుతున్నాయిగానీ, పరిష్కారం సున్నా. స్థానికంగా వైసీపీ అనుకూలురు సాధారణ జనంపై విరుచుకుపడుతుంటే న్యాయం చేయమంటూ ప్రాధేయపడుతున్నా ఫలితం ఉండడం లేదు. ఇంకోవైపు రైతుసంఘం బంద్‌కు పిలుపునిచ్చింది. గిరిజన వర్గాలైతే పోలవరం కేంద్రంగా జిల్లా కేటాయించాలని ఆందోళన బాట పట్టింది. డీఎస్సీ పోస్టులపై నిరుద్యోగులు రగిలిపోతున్నారు. ఓటర్ల జాబితాలు అనేక తికమకలూ తొంగి చూస్తూనే వున్నాయి.

తణుకులో అధికారుల హైడ్రామా.. రోజంతా ఆరిమిల్లి నిరసన



తణుకు, ఫిబ్రవరి 16 : తణుకు నరేంద్ర సెంటర్‌లోవున్న టీడీపీ ఫ్లెక్సీలను తొలగించేందుకు మునిసిపల్ అధికారులు గురువారం అర్ధరాత్రి వచ్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఘట నా స్థలానికి చేరుకుని అధికారులపై మండిపడ్డారు. మంత్రి కారుమూరి ప్రోద్బలంతోనే అధికారులు తమ పార్టీ నేతల ఫ్లెక్సీలను తొలగించేందుకు వచ్చారని మండిపడ్డారు. మహి ళా అధికారులను సైతం అర్ధరాత్రి రోడ్లపైకి పంపించి ఫ్లెక్సీల ను తొలగించాలని చెప్పడం అన్యాయమన్నారు. చివరకు ఎలాంటి ఫ్లెక్సీలు తొలగించబోమని అధికారులు స్పష్టం చేయడంతో టీడీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాని, మహిళా అధికారులు మళ్లీ శుక్రవారం తెల్లవారుజామున చడీ చప్పుడు లేకుండా ఫ్లెక్సీలను తొలగించారు. ఫ్లెక్సీల తొలగింపు విషయం ఉదయం తెలుసుకున్న ఆరిమిల్లి మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని ఉదయం 11 గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు మునిసిపల్ కార్యాలయంలోనే బైఠాయించి నిరసన తెలిపారు. వచ్చే సోమవారం వరకు ఎలాంటి ఫ్లెక్సీలు తొలగించమని రాత పూర్వకంగా టీపీవో హేమ లత, మేనేజర్ జయకర్ రాసి ఇచ్చారు. దీంతో ఆరిమిల్లి నిరసన విరమించారు.

ప్రజా సంఘాల కన్నెర్ర

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 16 : కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఏలూరులో భారత్ బంద్ నిర్వహించారు. రైతులు, కార్మికులు జూట్‌మిల్లు నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ రాస్తారోకో నిర్వహించారు. ప్రదర్శనలో కార్మికులు, సీఐటీయూ, ఇఫ్టూ, ఏఐటీ యూసీ, తదితర కార్మిక సంఘాలు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. రాస్తా రోకోలో పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలన్నారు. రైతు వ్యతిరేక మూడు నల్లచట్టాలను రద్దు చేయాలని, పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలన్నారు. ఢిల్లీలో రైతాంగం చేస్తున్న పోరాటంపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. డీఎస్‌వీడీ ప్రసాద్, వెంకట్రావు, శ్రీనివాస్ డాంగే, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, ఎ.రవి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహనరావు, రైతు కార్మిక సంఘ నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, కృష్ణమాచార్యులు, కిషోర్, తదితరులు నాయకత్వం వహించారు.

ఏలూరులో భారీ ర్యాలీ


ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసులు

- ప్రతిరోజూ పాఠశాలల సందర్శన
- 4 గంటల తర్వాతే ఆఫీసుకు వెళతా..
- ట్యాబ్స్ బాధ్యత ఉపాధ్యాయులదే
- పాఠశాలల్లో డీఈవో అబ్రహం ఆకస్మిక తనిఖీలు


గుడివాకలంక జడ్పీ హైస్కూలులో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 : 'పాఠ్యాంశం బోధించకుండానే దానిపై విద్యార్థులకు పరీక్ష ఎలా పెడతారు? విద్యార్థుల వర్క్‌బుక్‌లు ఎప్పటికప్పుడు కరెక్ట్ చేస్తే లోటుపాట్లు తెలుస్తాయి కదా. టీచర్లు వారికి నిర్దేశించిన జాబ్‌చార్ట్‌ను పాటిస్తున్నదీ, లేనిదీ ప్రస్తుతానికి పరిశీలిస్తాం. మరో పదిరోజుల్లో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు ఎంత వరకు అవగాహన చేసుకున్నదీ క్షేత్రస్థాయిలోనే తెలుసుకుంటాం. ఈ తనిఖీలు టీచర్లను అకారణంగా నిందించడానికి కాదు. వ్యవస్థను గాడిలో పెట్టడానికి మాత్రమే. ఇకమీదట రోజూ సాయంత్రం 4 గంటల తర్వాతే ఆఫీసుకు వెళతా. ఉదయం నుంచీ ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయి..' అని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం స్పష్టం చేశారు. ఏలూరు, భీమడోలు మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏలూరు రూరల్ మండలంలోని గుడివాకలంక జడ్పీ హైస్కూలులో విద్యార్థుల నోట్‌బుక్స్‌ను దిద్దని కారణంగా (కరెక్షన్) ఇద్దరు ఇంగ్లీషు సబ్జెక్టు టీచర్లకు, స్కూలుకు ట్యాబ్‌లను తీసుకురాని కారణంగా ఒక మ్యాథ్స్ టీచరుకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఈవో వెల్లడించారు. ఇక్కడి స్కూలులో మొత్తం 248 మంది విద్యార్థులుండగా టీచర్లు 14 మంది ఉన్నందున వర్క్‌లోడ్ ఉండబోదన్నారు. నాలుగు రోజుల్లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఆగడాలలంక జడ్పీ ఓరియంటల్ హైస్కూలులో నాడు-నేడు రెండో విడత నిర్మాణపనుల ప్రగతిని పరిశీలించారు. ఇక్కడ కూడా కొందరు విద్యార్థులు ట్యాబ్‌లను తీసుకురాకపోగా, మరి కొన్ని ట్యాబ్‌లు మరమ్మతుల నిమిత్తం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేసినట్టు హెచ్‌ఎం సత్యనారాయణ డీఈవోకు వివరించారు. ట్యాబ్‌లు పనిచేయడానికి అవసరమైన ఇంటర్నెట్ కనెక్షన్ స్కూలుకు లేక హాట్‌స్పాట్‌ను వినియోగించుకుంటున్నట్టు డీఈవో దృష్టికి తీసుకెళ్ళగా తక్షణమే ప్రైవేటు సంస్థల నుంచి ఇంటర్నెట్ సదుపాయాన్ని సమ కూర్చుకోవాలని ఆదేశించారు. ప్రతీ శుక్రవారం ట్యాబ్స్ డేగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాటిస్తున్నప్పటికీ విద్యార్థులు వాటిని స్కూలుకు తీసుకురాకపోవడం హెచ్‌ఎం, ఉపాధ్యాయులదే బాధ్యత అని పేర్కొన్నారు. చెట్టున్నపాడు, కొక్కిరాయలంక ప్రాథమిక పాఠశాలలను కూడా తనిఖీ చేశారు.



రథ సప్తమి పూజలు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రథ సప్తమిని ఘనంగా నిర్వహించారు. ఏలూరు, ద్వారకా తిరుమల తదితర ప్రాంతాల్లో ఆలయాల్లో సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్వారకా తిరుమలలో సూర్యప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో ఆశీనులైన శ్రీవారు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

పశువుల చెరువు ఆధునికీకరణకు మోకాలడ్డు



పాపం.. పశువులు ఏం చేశాయ్ !

వీరవాసరం, ఫిబ్రవరి 16 : పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలంలో పశుసంపద, పశుపోషక రైతులు అధికంగావున్న గ్రామం మత్స్యపురి. కాని, ఇక్కడ పశువులు తాగేందుకు కనీసం నీరు లేని పరిస్థితి. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.3.50 లక్షలతో పశువుల చెరువు ఆధునికీకరణకు ప్రతిపాదనలు చేసి, సాంకేతిక ఆమోదం కోసం పంపారు. కాని, ఏడాదిగా అది లభించడం లేదు. శాఖాధికారులు సరైన కారణాలను తెలియజేయడం లేదు. సాంకేతిక మంజూరు ఇవ్వటంలో అధికారుల నిర్లక్ష్యం అవగతమవుతోందని పంచాయతీ ప్రతినిధి ఆవేదన చెందుతున్నారు. స్పందనలోనూ ఫిర్యాదులు చేసినా, అధికారులను కలిసినా సాంకేతిక అనుమతులు ఇవ్వడం లేదు. దీనితో 15 నెలలుగా పశువులకు తాగు నీరు లేని పరిస్థితి. చెరువును ఎండగట్టడం వల్ల చెరువు తవ్వకానికి అనుకూలంగా ఉంది. ఈ చెరువు మెత్తం గడ్డితో నిండి ఉంది. పశువులను గ్రామానికి దూరంగా వున్న గొంతేరు పరీవాహక ప్రాంతానికి, మురుగుకోడు, మత్స్యపురి పంట కాలువ వద్దకు తీసుకువెళుతున్నారు. మత్స్యపురి జనసేన ఆధిపత్యంలో, వైసీపీకి ప్రతికూలంగా ఉండటమే కారణమని రైతులు విమర్శిస్తున్నారు. రాజకీయ విభేదాలను పశువులపై చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : జిల్లా స్థాయిలో ఆర్టీసీ నిర్వహించిన రహదారి భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో ప్రమాద రహిత డ్రైవర్లకు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. సభకు ఎస్పీ మేరీ ప్రశాంతి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రమాద రహిత రవాణా వ్యవస్థను అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు అందరూ బాధ్యత వహించాలన్నారు. ప్రయాణికులు, ప్రజల భద్రత డ్రైవర్లకు ముఖ్యమన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శాంతికుమారి మాట్లాడుతూ వేగమే ప్రమాదాలకు కారణమని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రోడ్డు నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఆర్టీసీ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొత్త బస్సులు అందుబాటులోకి వస్తున్నాయని, టిక్కెల జీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్ఎం వరప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోలకు చెందిన ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు అందజేశారు. జోన్ స్థాయిలో బి.వి.ఆర్.ఎం రావు, ఏలూరు డిపో పరిధిలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో ఎస్.కె దస్తగిరి (నూజివీడు) ప్రథమ స్థానం, జె.చెల్లయ్య (ఏలూరు) ద్వితీయ స్థానం, టీడీ చారి (ఏలూరు) తృతీయ స్థానం సాధించారు. డిపోల వారీగా ఏలూరు డిపో పరిధిలో ఆర్.వి రావు, పి.వి.పి రావు, ఎం.వి.ఎస్.ఆర్ కృష్ణ , జంగారెడ్డిగూడెం పరిధిలో బి.కె రెడ్డి, ఎం.చిన్నయ్య, డి.వి.ఎస్.ఎన్.టి. రాజు, నూజివీడు డిపో పరిధిలో డి.వి.కె రావు, కె.ఆర్ కృష్ణ, ఎండీ సిద్ధిక్ లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా నిలిచారు. వీరికి ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారం అందజేశారు. ఆర్టీసీ యూనియన్‌ల నాయకులు, సిబ్బంది, పీఆర్వో నరసింహం తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ బహుమతులు అందుకున్న డ్రైవర్లతో డీటీసీ శాంతకుమారి

అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు ప్రారంభం



దెందులూరు, ఫిబ్రవరి 16 : గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ 67వ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఉత్సవాలను ప్రారంభించి అమ్మవారికి దర్శించుకున్నారు. సంప్రదాయ బద్ధంగా బ్యాండు, సన్నాయిలతో అమ్మవారికి పుట్టింటి పసుపు కుంకుమ, సారె, బోనాలను గ్రామస్థులందరూ సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కాగా గ్రామ ప్రముఖుడు మణికంఠ కన్‌స్ట్రక్షన్ అధినేత రూ.కోటితో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం, నూతన తారురోడ్డులను దాత గంట కోటేశ్వరావు, అచ్చమ్మ దంపతులు, గంటా సుబ్బారావులతో కలిసి ఎమ్మెల్యే కొఠారు ప్రారంభించారు. సర్పంచ్ సుబ్బారావు, సహకార బ్యాంకు అధ్యక్షుడు తోట అచ్చియ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 16: బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు, సభ్యులు జంగం రాజేంద్రప్రసాద్ సూచించారు. ఏలూరులో శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లాల స్త్రీశిశు సంక్షేమశాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మిక, విద్య, పోలీస్, వైద్యఆరోగ్య తదితరశాఖలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం జరిగింది. ఇటీవల కాలంలో నమోదైన బాలకార్మికుల కేసులు, ప్రభుత్వం అందిస్తున్న నిధులు, చేపట్టిన చర్యలపై చైర్మన్ ఆరా తీశారు. ఆరు జిల్లాల్లో జరిగిన బాల్యవివాహాలు, పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, చట్టంపై నిర్వహించిన సదస్సులు, ఫోక్సో ఆయా కేసుల్లో జన్మించిన పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు జారీ, తదితర అంశాలపై చర్చించారు. బాలల హక్కులు, వారి సంక్షేమంపై ప్రభుత్వశాఖల సహకారం తదితర వివరాలు సేకరించారు. అప్పారావు మాట్లాడుతూ కమిషన్ తరఫున ఏడు జిల్లాల అధికారులంతా బాలల విషయంలో సమన్వయంతో పనిచేస్తూ బాలలహక్కులను, చట్టాల రక్షణకు కృషిచేయాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారిణి సూర్యచక్రవేణి, క్రాప్ పౌండేషన్ విజయవాడ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, ఆరు జిల్లాల మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులు, బాలల సంరక్షణ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంకా జీతాలు రాలేదు

కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల ఆందోళన

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 : జాతీయ ఆరోగ్య పథకం(ఎన్‌హెచ్‌ఎం)కింద ఉమ్మడిజిల్లాలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులైన ఆరోగ్య కార్యకర్తలు (మేల్), యూరోపియన్ కమ్యూనిటీ (ఈసీ) ఏఎన్ఎంలు, కాంట్రాక్టు ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బందికి జనవరినెల జీతాలు శుక్రవారంవరకు అందక పోవడంతో సంబంధిత ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెలలో 16 రోజులు గడిచినా జీతభత్యాలు ఇవ్వకపోవడంతో ఉమ్మడిజిల్లాలో సుమారు 400 మందికిపైగా కాంట్రాక్టు ఉద్యోగులు ఆర్థిక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.అప్పారావు, జె.గోవిందరావు ఓ ప్రకటనలో వివరించారు. జీతాలు అందక కుటుంబ అవసరాల నిమిత్తం, పిల్లల ఫీజుల నిమిత్తం, ఇతర ఖర్చుల నిమిత్తం వడ్డీలకు అప్పులు తెచ్చుకుని రోజులు గడుపుతున్నారన్నారు. సీఎం ఇచ్చిన వాగ్దానం మేరకు అర్హులైన వారరందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

19న తాడేపల్లిగూడెంలో ఎస్పీ స్పందన



భీమవరం క్రైం, ఫిబ్రవరి 16 : జిల్లా ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆలోచనతో ఈ నెల 19వ తేదీ సోమవారం స్పందన కార్యక్రమం తాడేపల్లిగూడెంలోని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవాలని కోరారు.

గ్రీవెన్స్ సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో శివన్నారాయణరెడ్డి

భీమవరం ఫిబ్రవరి 16 : సమస్యలను పరిష్కరించుకొనేందుకు ఉద్యోగుల గ్రీవెన్స్ చక్కని వేదికని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లాలోని వివిధ మండలాలు నుంచి వచ్చిన ఉద్యోగుల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌లో ప్రతి నెల మూడో శుక్రవారం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఐదు దరఖాస్తులు అందాయన్నారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామ పంచాయతీ కారదర్శి హరిప్రసాదుకు మేడపాడు, కొంతేరు గ్రామాలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారని, తనకు ఫిట్స్ వ్యాధి ఉందని ఆ రెండు ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. పాలకొల్లు పురపాలక సంఘ 9వ వార్డు సచివాలయంలో ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీగా పనిచేస్తున్న దిద్దే వెంకటేష్ తనను ఆకివీడు నగర పంచాయతీలో డిప్యూటేషన్ వేశారని తన స్వగ్రామం ఆచంట అని తండ్రి అనారోగ్యంతో ఉన్నారని దగ్గర ఉండి చూసుకోవాలని పాలకొల్లులోనే విధులు నిర్వహించుకునేలా చూడాలని కోరారు. కాళ్ళ మండలం కాళ్ళ గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంటుగా పని చేస్తున్న కె.అరుణ కుమార్ ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బదిలీ చేయాలని కోరారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా కలెక్టరు కార్యాలయ ఏవో పీహెచ్ పాపారావు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 16 : పోలీస్ సిబ్బంది ఎప్పుడూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) భీమారావు అన్నారు. భీమవరం మార్కెట్ యార్డు వద్ద గల గ్రౌండ్ నందు శుక్రవారం సివిల్, ఏఆర్, హోంగార్డు సిబ్బందికి మొత్తం 89 మందికి పరేడ్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ శారీరకంగా దృఢత్వం కలిగి ఉండడానికి వ్యాయామం, యోగా ప్రతీ రోజు చేయాలన్నారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివస్‌ను నిర్వహిస్తున్నారని ఏదైనా సమస్యలు ఎస్పీ దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

మళ్లీ పులి భయం

కన్నాపురంలో ఆవు దూడపై దాడి

పోలవరం, ఫిబ్రవరి 16 : ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల, గోపాలపురం, పోలవరం, బుట్టాయిగూడెం మండలాల్లో రెండు నెలలుగా పాడి పశువులపై దాడులకు పాల్పడిందంటూ ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురి చేస్తూ ఇటు అటవీ శాఖను ముప్పుతిప్పలు పెట్టిన పులి గురువారం కన్నాపురం పరిధి రేంజ్‌లో ఆవుదూడపై దాడికి పాల్పడడంతో ప్రజల్లో భయం మొదలైంది. కొన్ని రోజుల క్రితం పులి కొవ్వాడ, ఉడతపల్లిలో పాడి పశువలపై దాడులు చేసిన అనంతరం పాపికొండల అభయారణ్యంలోకి వెళ్ళిపోయిందని అటవీశాఖ అధికారులు ప్రకటించడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజల్లో తాజాగా కన్నాపురంలో పులి దాడి సమాచారంతో మళ్లీ భయం పట్టుకుంది. కన్నాపురం రేంజ్‌లో ఆవుదూడపై దాడి చేసి 95 శాతం తినేసింది. పులి మంచి ఆకలి మీద ఉన్నట్లుగా అర్థమవుతుందని ఆ పరిస్థితుల్లో మనుషులు ఎదురుపడినా అంతే సంగతులని ఏజన్సీ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పులి సంచారం అంచనా వేయలేమని సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీశాఖ సిబ్బంది తగు రక్షణ చర్యలు తీసుకుంటున్నారని అటవీ క్షేత్రాధికారి ఎస్.దావీదురాజు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయం.. ఒకరి అరెస్టు

ముసునూరు, ఫిబ్రవరి 16: మండలంలోని కొర్లకుంటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని శుక్రవారం ముసునూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుడైన చౌటపల్లి ప్రసాద్‌రావు ఇంటివద్దే అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని అందిన సమాచారంతో ఎస్సై పి.వాసు తన సిబ్బందితో దాడి చేశారు. 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడు ప్రసాద్‌రావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని నూజివీడు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

రొయ్యి రైతుకు షాక్ !

కొన్ని గంటల్లోనే కిలోకు రూ.40 ధర తగ్గింపు
ఆకస్మికంగా తగ్గడంపై రైతుల ఆందోళన
ఉద్దేశపూర్వకంగా తగ్గించారనే ఆరోపణ
ఉమ్మడిగా పోరాటానికి నిర్ణయం

భీమవరం, ఫిబ్రవరి 16 : ఆశాజనకంగా ఉందనుకున్న కొన్ని గంటల్లోనే కిలోకు 40 రూపాయలు పడిపోవడం రొయ్య రైతులను విస్మయానికి గురి చేసింది. మార్కెట్లో పరిస్థితులు వల్ల తగ్గిందా? ఉద్దేశపూర్వకంగా ధర కోత వేశారా ? నాలుగు రోజులుగా మార్కెట్లో రొయ్య ధర తగ్గింపుపై ఆక్వా రైతులు పడుతున్న తర్జన భర్జన ఇది. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని రెండు రోజులుగా ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మొన్నటి బుధవారం భీమవరంలో సమావేశం నిర్వహించారు. ధర తగ్గడంపై ట్రేడర్ల నుంచి సమాచారం సేకరించారు. కారణాలు ఆరా తీస్తూ దశలవారీ సమావేశాలు


భీమవరంలో మూడు రోజుల క్రితం సమావేశమైన రొయ్య రైతులు

ఏర్పాటు చేస్తున్నారు.ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటల వరకు రొయ్యల ధరలు ఆకస్మికంగా తగ్గి పోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 30 కౌంటు రొయ్యలు 480 రూపాయలు పలికింది.. కొన్ని గంటల్లోనే అది 40 రూపాయలు తగ్గి 440 వద్ద ఆగింది. ఇది ఉద్దేశపూర్వకంగానే వ్యాపారులు చేసిన పనేనని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కొన్ని రకాల కౌంట్ రొయ్యలను కొనడం లేదని కూడా రైతులు చెబుతున్నారు. వాస్తవంగా మార్కెట్లో రొయ్యలు ధరలు స్థిరంగా కొన సాగాలని గతేడాది ప్రభుత్వం కొన్ని మార్గ దర్శకాలని జారీ చేసింది. వంద

కౌంట్	పాత	కొత్త
	(ధరలు రూపాయల్లో)	
30 కౌంట్	480	440
40 కౌంటు	415	390
50 కౌంటు	355	340
60 కౌంటు	315	300
70 కౌంట్	295	280
80 కౌంట్	270	260
90 కౌంటు	260	250
100 కౌంట్	250	240



కౌంటు రొయ్య రూ.240 తగ్గకుండా కొనసాగాలని ఆదేశాలిచ్చారు. ఏడాది కాలంగా ఈ ఆదేశాలు ఒకటి రెండు సార్లు మినహా అమలుకు నోచుకోలేదు. ఓ దశలో రూ.195లకు పడిపోయింది. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులకు అను గుణంగా రొయ్య ధరల్లో హెచ్చు, తగ్గులు ఉంటాయి. గత నెలలో కాస్త ధరలు పెరిగి ఆశాజనకంగా కొనసాగుతున్న తరుణంలో కొన్ని గంటల్లోనే ధరకు భారీ కోత విధించడం పైనే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆక్వా ప్లాంట్ల యజమానుల నిర్ణయంగా దీనిని చెప్తున్నారు. రైతు సమస్యలపై నాలుగేళ్లుగా పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఈసారి ధరల గురించి అధికారులు దృష్టికి తీసుకు వెళ్లాలని నిర్ణయించినట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి జీకేఎఫ్ సుబ్బరాజు తెలిపారు. రాష్ట్రంలో పలు రైతు సంఘాలు ఉన్నాయి. సంఘాలన్నీ రైతు సమస్యలపై పోరాటం చేస్తున్నందున ఈసారి ఒకే వేదికగా ఏర్పాటై, ఐక్యంగా ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయిం చుకున్నారు. ఇప్పటికే రెండు మూడు సమావేశాలు ఏర్పాటు చేశారు. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుని తదుపరి కార్యాచరణకు వెళ్లాలని నిర్ణయించారు.


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు.. పెండ్లి కొడుకును చేస్తూ బుగ్గన చుక్క పెడుతున్న అర్చకులు.. రాజావారి వీధికి రథాన్ని లాగుతున్న భక్తులు

లక్ష్మీనరసింహుని కల్యాణానికి ఏర్పాట్లు

సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 16: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి రోజున వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. తిరువారాధన, బాలభోగం, పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామివారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహన చోదకులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజావారి వీధి)కి చేర్చారు.

కల్యాణ వేడుకలకు శ్రీకారం

శ్రీకర, శుభకర, ప్రణయ స్వరూపుడైన ఆది దేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను తీర్చిదిద్దారు. విశేష పూజలందుకున్న స్వామి, అమ్మవార్లను అర్చకులు పెళ్లికి సిద్ధం చేశారు. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు నృసింహ నామచరణాలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప కాంతుల నడుమ పురవీధుల్లో ఊరేగారు. రథ సప్తమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాకార మండడంపైన ఉదయం అధిక సంఖ్యలో మహిళా భక్తులు సూర్య నమస్కారాలు చేశారు.

అంతర్వేదికి ప్రత్యేక బస్సులు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 : అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ ఉత్సవాల సందర్భంగా సోమవారం, మంగళవారం జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి వీరయ్య చౌదరి తెలిపారు. ఈ బస్సులు మలికిపురం వరకు మాత్రమే నడుస్తాయన్నారు. గత ఏడాది జిల్లా నుంచి 81 సర్వీసులను నడిపామని సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని డిపోల మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. భీమవరం డిపో నుంచి అంతర్వేదికి 19వ తేదీ సోమవారం నుంచి 20వ తేదీ మంగళవారం వరకూ భక్తుల సౌకర్యార్థం ఉదయం 8 గంటల నుంచి భీమవరం కొత్త బస్టాండ్ నుంచి ప్రతీ 20 నిముషాలకి ఒక బస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి తెలియజేశారు.


చంద్రప్రభ వాహనంపై ఉభయదేవేరులతో ఊరేగిన చిన వెంకన్న

ఆదిత్యునిపై ఆదినారాయణుడు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 16: ప్రభాతవేళ.. సప్త అశ్వాలను శ్రీదేవి, భూదేవి సమేతంగా అధిరోహించిన శ్రీవారు తిరువీధులకు తరలివెళ్లి భక్తులకు అభయ ప్రదానం చేశారు.సాయం సంధ్య వేళ ఉభయ దేవేరులతో చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామి పురవీధుల్లో ఊరేగారు. రథసప్తమి పర్వదినాన జరిగిన ఈ ఉత్సవాలు భక్తులను పరవశింపచేసింది. ముందుగా ఉదయం సూర్యప్రభపైన, సాయంత్రం చంద్రప్రభపైనా స్వామి, అమ్మవార్లను ఉంచి అలంకరించారు. హారతులిచ్చారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ తిరువీధుల్లో ఊరే గించారు. భక్తుల హారతులు సమర్పించారు. చినవెంకన్న క్షేత్రం శుక్రవారం భక్తులతో కళకళలాడింది. రథసప్తమి పర్వదినం కావడంతో ఆలయానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.


అసంపూర్తిగా సాలిపేట రోడ్డు

ఆయనుంటే.. పనులు చేయలేం

జంగారెడ్డిగూడెంలో చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 16: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు పారిపోయే పరిస్థితి నెలకొంది. కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోం దని భవిష్యత్‌లో ఎవరూ వర్కులు చేయడానికి ముందుకు రారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో అధికారుల చేతులు తడపనిదే సకాలంలో బిల్లులు అవ్వవనే అపవాదు ఉంది. కోట్ల రూపాయల పనులు చేయించుకొని బిల్లులు చేయడానికి అధికారులకు చేతులు రావడం లేదని కొవ్వూరుకు చెందిన కాంట్రాక్టర్ భేతిన వెంకటప్రసాద్ చెబుతున్నారు. కాంట్రాక్టర్లు ఎవరూ రావడం లేదని వర్కులు మొదలుపెడితే బిల్లులు త్వరగా ఇస్తానని 2022లో అప్పటి కమిషనర్ కాంట్రాక్టర్ చెప్పడంతో రెండు కోట్ల రూపాయలతో పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ప్రసాద్ చెబుతున్నారు. వర్క్ పూర్తి చేసిన వారం రోజుల్లో అధికారులు ఆ వివరాలను సీఎఫ్ఎంఎస్ చేయాల్సి ఉందని అయితే స్థానిక అధికారులు ఎనిమిది నెలల సమయం తీసుకుంటే బిల్లులు ఎప్పుడు తీసుకోవాలని కొందరు కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. బిల్లులు చేయడంలో కమిషనర్ అలసత్వం వహిస్తున్నారని డిసెంబరులో రాజమహేంద్రవరం అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ప్రసాద్ తెలిపారు. అధికారులు కమిషనర్‌కు మెమో అందించినా నేటికీ బిల్లులు సీఎఫ్ఎంఎస్ చేయలేదన్నారు. పట్టణంలోని 21, 22, 23, 24 వార్డులకు అనుసంధానంగా ఉండే సాలిపేట రోడ్డు రూ.70 లక్షల అంచనాలతో గత నెలలో నిర్మాణం మొదలుపెట్టి మధ్యలో వది లేశారు. ఇప్పటి వరకు రూ.7 లక్షల వరకు ఖర్చు అయిందని పాత బిల్లులు వస్తేగాని మిగిలిన వర్క్ పూర్తిచేయలేనని కాంట్రాక్టర్ ప్రసాద్ చెబుతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ

21 నుంచి బీజేపీ ప్రజాపోరు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 16: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పార్టీ నర్సాపురం పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రజా పోరు కార్యక్రమానికి వర్మ ఐదు జిల్లాలకు క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేసిన పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో ప్రచారం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా పోరు భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల లీలా కృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ కోమటి రవికుమార్, భీమవరం అసెంబ్లీ కో-కన్వీనర్ అడబాల శివ, యువ మోర్చా నాయకులు వినోద్ వర్మ పాల్గొన్నారు.



జడ్పీ కార్యాలయ ప్రాంగణంలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లానాయకులు

ఓట్ ఫర్ ఓపీఎస్ ఆందోళనకు పోలీసుల మోకాలడ్డు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 : ' ఓట్ ఫర్ ఓపీఎస్ ' నినాదంతో ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన చలో విజయ వాడ ఆందోళన కార్యక్రమానికి జిల్లానుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులెవ్వరూ హాజరవ్వకుండా నిలువరించేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆదివారం జరిగే చలో విజయవాడ ఉద్యమానికి ప్రభుత్వ అనుమతులు లేనందున ఆందోళనకు హాజరుకావద్దని, దిక్కరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ శుక్రవారం సాయంత్రం నుంచే నోటీసులు జారీచేసే పనిని ప్రారంభించారు.మరోవైపు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చలో విజయవాడ ఉద్యమానికి హాజరయ్యేందుకు ఉద్యోగ సంఘాలు సన్నాహాలు చేసుకుంటున్నాయి. ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్ పోస్టర్లను శుక్రవారం ఏలూరు జడ్పీ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. పోలీసు నోటీసులు అందుకున్నవారిలో ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు రెడ్డి రామా రావు, కోశాధికారి మూల్పూరి రాంబాబు, రాష్ట్ర కౌన్సిలర్లు శ్రీనివాస్, బెన్‌హర్, జిల్లా అదనపు అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ, డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తదితరులున్నారు. మిగతా ఉద్యోగ, ఉపా ధ్యాయ సంఘాల నాయకులకు శనివారం నోటీసులను జారీచేసే అవకాశం ఉంది.


జిన్నూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పోడూరు, ఫిబ్రవరి, 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని విద్యార్థులు నూటికి నూరుశాతం సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని మధ్యాహ్న భోజనం పథకం, పాఠశాలల పారిశుధ్య జిల్లా కో-ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని జిన్నూరు హైస్కూల్‌లో శుక్రవారం ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రద్ధ తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈవోలు జి.విజయ కుమార్, జివి.సూర్యనారాయణ, హైస్కూల్ హెచ్‌ఎం శివజ్యోతి, పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.


కళ్యాణ వేదకపైకి స్వామివారిని తీసుకొస్తున్న భక్తులు.. త్రిపురాంతకేశ్వర స్వామి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కవిటంలో ఘనంగా అతిరుద్ర మహాయాగం

కన్నుల పండువగా త్రిపురాంతకేశ్వర స్వామి కల్యాణం

పోడూరు, ఫిబ్రవరి, 16 : పోడూరు మండలం కవిటంలో ఆధ్యాత్మిక శోభాయమానంగా అతిరుద్ర మహాయాగం మహోత్సవాలు ఆరో రోజు శుక్రవారం అత్యంత ఘనంగా జరిగాయి. వేద పండితులు రుద్రహోమం పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నెలమూరుకు చెందిన ఉమా రామ లింగేశ్వర ట్రస్ట్, శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు, గ్రామస్థులు సహకారంతో ఆధ్యాత్మికవేత్త జంధ్యాల శ్రీనివాసశర్మ(నెలమూరు శర్మ) పర్యవేక్షణలో ఈ యాగ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రథసప్తమి పురస్కరించుకుని సూర్యనారాయణస్వామికి ప్రీతిగా ప్రత్యేక హోమం పూజలు, సూర్య నమస్కార పూజలు నిర్వహించారు. 56 మంది రుత్వికులచే 1,232 సార్లు రుద్ర పారాయణలు ఈశ్వరునికి అభిషేకం నిర్వహించారు. 25 మంది రుత్వికులచే 84 సార్లు చండీ పారాయణం నిర్వహించారు. రుద్ర హోమం, రుద్ర క్రమార్చన త్రిశతీ అర్చన చండీ హోమం, వేద స్వాహకారం అరుణ హోమం నిర్వహించారు. త్రిపుర భైరవీ మహా విద్యా మూల మంత్ర హవనం నిర్వహించారు. మేళతాళాలతో, పండితుల మంత్రో చ్ఛరణలతో భక్త జన సందోహం మధ్య కన్నుల పండువగా త్రిపురాంతకం మహాక్షేత్రంలోని త్రిపురాంతకేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు.

మావుళ్ళమ్మకు 8 గ్రాముల బంగారం అందజేత



భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 : మావుళ్ళమ్మ అమ్మవారికి శుక్రవారం పట్టణానికి చెందిన పిశిరీషా, శివరామ వర్మ దంపతులు 8 గ్రామల బంగారాన్ని బహూకరించారు.దాతలు అమ్మవారిని దర్శించుకోగా అర్చకులు వారి కుటుంబ సభ్యుల పేరిట పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు.మాజీ చైర్మన్ కారుమూరి సత్యనారాయణమూర్తి ఉన్నారు.

రాజకీయాలకు స్వస్తి : కాపా

నూజివీడు, ఫిబ్రవరి 16: ఈ రోజు నుంచి తాను రాజకీయాలకు స్వస్తి చెబుతున్నట్లు నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ నాయకుడు కాపా శ్రీనివాసరావు ప్రకటించారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తనపై, తన కుటుంబీకులపై నిరాధార ఆరోపణలు, అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వ్యక్తులను, ప్రోత్సహిస్తున్న స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్‌లు, నాయకుల వ్యవహార శైలిపై పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్ళినా వారిని అదుపు చేయలేదని, ఇలాంటి రాజకీయాల్లో తాను ఇమడలేనని భావించి రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.


గ్యాస్ బండ్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

గ్యాస్ సిలెండర్లు సీజ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16 : గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలెండర్లను ఒక హోటల్‌లో వాడుతున్నట్లు సమాచారం అందడంతో విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు శాంతినగర్‌లో ఉన్న అమృత హోటల్‌లో శుక్రవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలెండర్లు (సబ్సిడీ సిలెండర్)లు 10 ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్‌చేశారు. హోటల్ యజమాని బంకపల్లి దుర్గాప్రసాద్‌ను విచారించగా హోటల్ వ్యాపార నిమిత్తం సబ్సిడీ సిలెండర్లను తెలిసిన వారి వద్ద నుంచి 50 రూపాయలు అదనంగా ఇచ్చి కొనుగోలు చేసి తెచ్చుకున్నట్లు తెలిపారు. నిత్యావసరాల చట్టం 1955 కింద కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనునాయక్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై అత్యాచారం కేసు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16 : ఒక యువకుడు ప్రేమిస్తున్నానని పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి పెళ్ళికి నిరాకరించడంతో బాధితురాలు ఏలూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆ యువకుడిపై అత్యాచారం కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన వివాహిత(24) పెళ్లయిన రెండు నెలలకే తన భర్తను వదిలిపెట్టి తన పుట్టింటి వద్దే ఉంటున్నది. ఏలూరు బీడీ కాలనీకి చెందిన శ్రీహరి అనే యువకుడు ఆమెకు పరిచయమయ్యాడు. ఇది కాస్తా ప్రేమగా మారింది. ఆమె గర్భం దాల్చింది. పెళ్ళి చేసుకోమంటే ఆ యువకుడు నిరాకరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ సీఐ ప్రభాకరరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆ యువకుడిపై అత్యాచారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు రహదారి నిబంధనలు తెలుసుకోవాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16: విద్యార్థులు రహదారి నిబంధనలు తెలుసుకోవాలని, నిర్లక్ష్యం, అతివేగం, అజాగ్రత్తతో రోడ్డు ప్రమదాలు సంభవిస్తున్నాయని ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏలూరు పరిసర ప్రాంతాల్లోని తొమ్మిదికాలేజీల అధ్యాపకులు, యాజమాన్య ప్రతినిధులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమదాల్లో ఎక్కువగా యువత మరణిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించడానికి ఒక్కో కాలేజీ నుంచి ఐదుగురిని ఎంపిక చేసి జిల్లాకు పంపిస్తే వారికి శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి స్కూలులో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. డీటీఆర్బీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, ఎంవీఐ ప్రసాదరావు, డీఎస్పీ ఈ శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల పని ప్రదేశాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలి


సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16: మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రదేశంలో తప్పనిసరిగా అంతరంగిక కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. డీఎల్ఎస్ఏ ఆధ్వరంలో మహిళా సాధికారత రక్షణ చట్టాలపై అవగాహన సదస్సును ఐటీడీసీ హాలులో శుక్రవారం నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ పది మంది మించి ఉద్యోగులు పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో తప్పనిసరిగా కమిటీలను ఏర్పాటు చేయాలని, మహిళలకు ఏమైనా సమస్యలు ఎదురైతే ఆ కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలకు ఏవిధమైన సమస్యలు ఎదురైనా కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఉంటుందని ఆ కమిటీ ముందు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. న్యాయ సహాయం అందించడానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. నేషనల్ ఉమెన్స్ కమీషన్ ట్రైనీ టి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళల రక్షణ చట్టాలు వినియోగించుకోవాలన్నారు. మహిళా ఉద్యోగులకు సమాన వేతనం చెల్లించకుంటే సంబంధిత అధికారులకు కాని, జిల్లా న్యాయసేవాధికార సంస్థకు కాని తెలియజేయాలన్నారు. ఈకార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు మేనేజర్ అనిత పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16: ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, పోలీస్ సిబ్బంది సహకరిస్తారని టూటౌన్ సీఐ ప్రభాకర్ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు టూటౌన్ సీఐ, సిబ్బంది శుక్రవారం గన్‌బజార్ ప్రాంతంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలను సీఐ పరిశీలించారు. ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలి


రిలే దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16: భూహక్కు చట్టం రద్దు చేయాలని ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు 38 రోజులుగా జిల్లా కోర్టు గేటు వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఏపీ టైటిలింగ్ యాక్టు 27/23ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల చిన్న, సన్నకారు రైతులు, పేదలకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. అన్యాయం జరిగినా కోర్టులను ఆశ్రయించే అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రజలకు తాము అవగాహన కల్పిస్తున్నామని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. న్యాయవాదులు ఎంవీపీ.రావు, ఎస్ఎంఎం నాగరాజు, సుబ్బారావు, సిహెచ్ రమేష్, ఏలూరు వెంకటేశ్వరరావు, మాణిక్యాలరావు, కానాల రామకృష్ణారావు, రాంబాబు పాల్గొన్నారు.

డీఎస్సీ ఆదివాసీ అభ్యర్థులకు వసతి సౌకర్యం కల్పించాలి


పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 16: ఐటీడీఏ వద్ద వైటీసీలో డీఎస్సీ శిక్షణ పొందుతున్న ఆదివాసీ అభ్యర్థులకు వసతి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కొమరం వెంకటేశ్వరావు శుక్రవారం పీవో ఎం.సూర్యతేజకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ సుదూర, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చి అభ్యర్థులు శిక్షణ పొందడం ఇబ్బందికరమని, వసతి సౌకర్యం కల్పిస్తే ఎక్కువ మంది అభ్యర్థులు శిక్షణ పొందే అవకాశం ఉందన్నారు. సానుకూలంగా స్పందించిన పీవో వసతి సౌకర్యం కల్పించడానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సోడెం మల్లయ్య, సోదెం ముక్కయ్య, తెల్లం లక్ష్మణరావు, రవ్వా బసవరాజు, ఇరపా రాంబాబు, తెల్లం శేఖర్, పూనెం వెంకటేశ్వరావు, కొరస తులసీరావు, గోవిందరావు పాల్గొన్నారు.


రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 16: రైతులకు, కౌలురైతులకు ఖరీఫ్ ధాన్యం బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నేభవన్‌లో శుక్రవారం శ్రీనివాస్ మాట్లాడుతూ జాలిపూడి, కాట్లంపూడి గ్రామాలకు చెందిన రైతులు, కౌలు రైతులు జనవరి 12న ధాన్యం విక్రయించారన్నారు. 35రోజులు దాటినా సొమ్ము చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రబీ పంటసాగు పెట్టుబడులు లేక రైతులు అల్లాడుతున్నారని అన్నారు. పౌరసరఫరాల సంస్థ మేనేజర్ మంజుభార్గవికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రంగారావు, దాసు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఆదాయం పెంచాలి : మార్కెటింగ్ ఆర్‌జేడీ

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 12: వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచాలని ఇచ్చిన టార్గెట్ పూర్తి చెయ్యాలని మార్కెటింగ్ ఆర్‌జేడీ పి.లావణ్య అన్నారు. జీలుగుమిల్లి వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టును శుక్రవారం ఆమె పరిశీలించారు. చెక్‌పోస్టు ద్వారా ఏడాదికి రూ.2.5కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.2.2 కోట్లు వచ్చిందన్నారు. మార్చి నెలాఖరులోపు లక్ష్యం పూర్తి చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంత చెక్‌పోస్టు కావడంతో సిబ్బంది విధులు నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. లారీల్లో తరలించే సరుకు, బిల్లులు పరిశీలించి దానికి తగ్గట్టు సెస్ రాయాలన్నారు. పోలవరం ఏఎంసీ సెక్రటరీ మోహన్‌రావు, ఏలూరు సెక్రటరీ శారదారాణి ఉన్నారు.



లింగపాలెం, పోలవరంలో అంగన్‌వాడీల నిరసన ప్రదర్శన

సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీల ప్రదర్శన

లింగపాలెం, ఫిబ్రవరి 16: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ర్యాలీ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని చెప్పిన సీఎం కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ నాయకులు బీజేఎన్ కుమారి, వి.ఈశ్వరి, మండలంలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

- పోలవరం: అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి పీఎల్ఎస్ కుమారి డిమాండ్ చేశారు. కార్మికులతో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా అనంతరం ర్యాలీ నిర్వహించారు. కుమారి మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణ, ఆశా వర్కర్ల సంఘం మండల నాయకురాలు కుసుమకుమారి, చెరుకూరి మణి, సత్యవతి, పద్మ, అత్తిలి లక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో వామపక్ష, ప్రజా సంఘాల ప్రదర్శన



పోలవరంలో ఎర్ర జెండాలతో ర్యాలీ


చింతలపూడి సెంటర్‌లో కార్మికుల మానవహారం


కుక్కునూరులో బంద్ నిర్వహిస్తున్న వామపక్షాలు

ఏజెన్సీ బంద్

జిల్లాలో పాక్షికం.. నిరసన ప్రదర్శనలు
కదం తొక్కిన రైతు, కార్మిక సంఘాలు

కార్మిక, రైతాంగ సమస్యలపై వామపక్షాలు, రైతు, కార్మికుల సంఘాల పిలుపు మేరకు పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ఏజెన్సీ ప్రాంతాల్లో విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, దుకాణాలు మూసివేశారు. జిల్లాలో మిగిలిన చోట్ల పాక్షికంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నా రాస్తారోకోతో రైతు, కార్మిక సంఘాలు కదం తొక్కాయి.

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 16: కార్మిక, రైతాంగ సమస్యలపై సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఎం, సీపీఐ, ఏఐకేఎంఎస్, ఏకేఎంఎస్, గిరిజన సంఘం, రైతు సంఘం, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏజెన్సీలో జరిగిన గ్రామీణ, పారిశ్రామిక బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలను, పాఠశాలలు, కళాశాలలను, బంకులను, షాపులను మూయించి వేశారు. బుట్టాయగూడెం సెంటరులో రాస్తారోకో, ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు కారం రాఘవ, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, బీవీనోద్, కారం దానయ్య, కట్టం వీరాస్వామి, టి.బాబురావు మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక కార్మికులకు, కర్షలకు తీరని అన్యాయం చేస్తున్నారని, రైతాంగ సమస్యలను పట్టించుకోవడంలేదని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతుల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు డిల్లీలో అడుగుపెట్టకుండా అన్నివిధాలుగా ఆటంకాలు కల్పిస్తూ మోదీ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. పోరాటాలు చేసి సాధించుకున్న కోడ్‌లను 4 కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమన్నారు. కె.పోతురెడ్డి, టి.ముత్యాలమ్మ, పి.నాగేశ్వరావు, కె.కన్నారావు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పోలవరం: గ్రామీణ బంద్ విజయవంతమైంది. ఏపీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం సంయుక్తంగా పోలవరంలో ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించి వర్తక వ్యాపార సముదాయాలను మూయించారు. ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేసి విప్లవ గీతాలు ఆలపించారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కుంజం రామారావు, ఎస్‌కె భాషా, మిడియం పోశీరావు, కొమరం రామారావు, రైతు కూలీ సంఘం, గిరిజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. బంద్ ప్రభావం వలన మెయిన్ రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.
- టి.నరసాపురం: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు, వెలుగు కార్యాలయం, సచివాలయం మూయించారు. అంబేడ్కర్ సెంటర్లో కార్మికులు ఆందోళన చేపట్టారు. వ్యాపారులు దుకాణాలు మూసి బంద్‌కు మద్దతు తెలిపారు. సీపీఎం మండల నాయకులు అనుమోలు మురళి, మడకం సుధారాణి తదితరులు ఉన్నారు.
- జీలుగుమిల్లి: మండలంలో బ్యాంకు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు మూతపడ్డాయి. జీలుగుమిల్లి ప్రధాన సెంటరులో రాస్తారోకో, ర్యాలీ నిర్వహించారు.తెల్లం దుర్గారావు, ఎన్వీ.అప్పారావు, కట్టం నాగేశ్వరరావు, సీహెచ్.కొండలరావు, సీహెచ్.సీతారామయ్య, నాయకులు ఉన్నారు.
- కుక్కునూరు: మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కుక్కునూరులో దుకాణాలు మూతపడగా, మధ్యాహ్నం వరకు వాహనాలు నిలిచిపోయాయి. వై.నాగేందర్ రావు,సాయికిరణ్, మహబూబ్ పాషా, బయ్యన శ్రీను, సత్యనారాయణ, ఎం.వెంకటాచారి, మడకం వీరయ్య పాల్గొన్నారు.
- పెదపాడు: రైతు గెలవాలి.. వ్యవసాయం నిలవాలంటూ బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఢిల్లీలో రైతుల పోరాటానికి అండగా నిలవాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
- చింతలపూడి: యర్రగుంటపల్లి, సమ్మెటవారిగూడెం, మల్లాయిగూడెం, ప్రగడవరం గ్రామాల్లో బంద్ పాటించారు. చింతలపూడిలో పెట్రోలు బంకు నుంచి బోసుబొమ్మ సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్, ఆర్వీ.సత్యనారాయణ, డి.కృష్ణ, టి.బాబు మాట్లాడారు. యూనియన్ నాయకులు కంచర్ల గురవయ్య, వీరబాబు, శ్రీను, వెలగాడి అనురాధ, వి.బాలు, బాలరాజు, అలెగ్జాండర్, రంగనాథ్, సరోజిని, మాణిక్యం, ఆశ వర్కర్ల నుండి సుభద్ర, పలువురు సభ్యులు ర్యాలీ, సమ్మెలో పాల్గొన్నారు.
- ద్వారకాతిరుమల: సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా గరుడాళ్వార్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు లింగరాజు, తులసి, లలిత, ధనలక్ష్మి, కట్టా భాస్కరరావు, నాగరాజు, వీర్రాజు, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.
- భీమడోలు: కార్మికులు, కర్షకులు ఐక్యంగా భారీ ర్యాలీ నిర్వహించి భీమడోలు జంక్షన్‌లో మానవ హారం చేపట్టారు. లింగరాజు, నాయకులు రంగరాజు, కట్టా భాస్కరరావు, నాగరాజు, స్వర్ణకుమారి పాల్గొన్నారు.
- పెదవేగి: కేంద్రంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు పి.హైమావతి అన్నారు. పెదవేగిలో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో తులసి, రోజా, అనూరాధ, నాగరాజు, సుబ్బారావు, గంగరాజు, వెంకట రవి తదితరులు పాల్గొన్నారు.







పెదపాడు, ద్వారకా తిరుమల, భీమడోలు జంక్షన్, పెదవేగిలో రైతు, కార్మిక సంఘాల ప్రతినిధులు, అంగన్వాడీల నిరసన ప్రదర్శనలు

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీ


తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

చింతలపూడి, ఫిబ్రవరి 16: మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో కేఆర్.పురం ఏడీఏ పీజీ.బుజ్జిబాబు, ఏవో కె.మీనాకుమారి తనిఖీ చేశారు. ఎరువులు ఈ-పోస్ ద్వారా అమ్ముతున్నారా, లేదా పరిశీలించారు. బుజ్జిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎరువులన్నింటికీ రాయితీలు ఇస్తుందని, పారదర్శకత కోసం ఈ-పోస్ విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. రైతులు ఎరువులు కొనుగోలులో ఆధార్ నెంబర్ చెప్పి రైతు వేలిముద్ర ఈ-పోస్ యంత్రంలో నమోదు చేసి ఎరువులు పొందాలన్నారు. దుకాణదారులు ప్రతీరోజు ఎరువుల నిల్వలను ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన ఎరువులను వాటికి సంబంధించిన పత్రాలను లైసెన్సులో నమోదు చేసుకుని వాటిని మాత్రమే రైతులకు అమ్మాలన్నారు. పలు దుకాణాల్లో బిల్ బుక్స్ తనిఖీ చేశారు.

యడవల్లి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల పరిశీలన


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న విజయకృష్ణ

కామవరపుకోట, ఫిబ్రవరి 16 : తూర్పు యడవల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఫౌండేషన్ ప్లస్ స్కూలును జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ వంటిపల్లి విజయకృష్ణ శుక్రవారం పరిశీలించారు. హాజరు, స్టాక్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున వారికి అందుతున్న పోషకాహార సరఫరా వివరాలను గమనించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. నియమానుసారం విద్యార్థుల హాజరు ఉండాలని చెప్పారు. ప్లస్ స్కూలులో విద్యార్థులకు అందుతున్న ఆహార పదార్థాలను, నాణ్యను, రుచి, శుచిని పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందుతుందో, లేదో అడిగి తెలుసుకున్నారు.

వ్యవసాయ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

లింగపాలెం, ఫిబ్రవరి 16: మార్కాపురం వ్యవసాయ కళాశాల విద్యార్థులకు సింగగూడెం వ్యవసాయ క్షేత్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు పి.సుజాత, ఎం.నాగేంద్రబాబు పాల్గొన్నారు. గ్రామ వ్యవస్థపై సింగగూడెం గ్రామపటంతో వివరించారు. అనంతరం మొక్కజొన్న పంటను పరిశీలించారు. కత్తెరపురుగును నిర్మూలించటానికి వాడాల్సిన పురుగుమందుల గురించి రైతులకు వివరించారు. మార్కాపురం, ఎస్ఎస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు విజ్ఞేష్, ధర్మతేజ, పలువురు రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన రాష్ట్ర బాలల హక్కుల కమిషనర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 16: రాష్ట్రబాలల హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు శుక్రవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను కలిశారు. బాలల హక్కుల పరిరక్షణ, ప్రాంతీయ స్థాయి కన్వర్షన్స్ సమావేశానికి ఏలూరు వచ్చిన కలెక్టర్‌ను కలిశారు.

జగన్‌ను గద్దె దింపడమే ఏకైక లక్ష్యం


కాపు సంఘ నేతలతో రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 16: అరాచక పాలన కొనసాగిస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో గద్దె దింపడం లక్ష్యమని, టీడీపీ-జనసేన కూటమికి విజయానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. పలు జిల్లాలకుచెందిన కాపు, బలిజ, తెలగ, ఒంటరి, మున్నూరుకాపు, తూర్పుకాపు ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. జనసేన, టీడీపీ కూటమితోనే సుపరిపాలన సాధ్యపడుతుందని తన అభిప్రాయాన్ని తెలియచేయగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు.

రేపు ఉద్యోగుల చలో విజయవాడ

కుక్కునూరు,ఫిబ్రవరి 16: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో చలో విజయవాడ పోస్టర్లు శుక్రవారం ఆవిష్కరించారు. ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగదుర్గారావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోరుతూ ఆదివారం చలో విజయవాడ ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమం జరుగుతుందన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు ఈ ప్రభుత్వంలో కనీసం ఒక్క డీఏ కూడా విడుదల చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బి.బాలకృష్ణ, శ్యాం ప్రసాద్, సత్యనారాయణ, పద్మావతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతికి వినతి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని కోరుతూ శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేసినట్టు డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. టీచర్స్ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి తదితరులు వినతిపత్రం అందజేశారన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని త్రీ టౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలో శుక్రవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారుల పత్రాలు పరిశీలించారు. కొందరు రికార్డులు లేకుండా లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారికి సీఐ వెంకటేశ్వరరావు, త్రీ టౌన్ ఎస్ఐ ప్రసాద్‌లు కౌన్సెలింగ్ నిర్వహించారు. కచ్చితంగా వాహన రికార్డులు, బీమా, నడిపే వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 2640 మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 : ఇంటర్మీడియట్ ఒకేషనల్, జనరల్ విభాగాల ప్రాక్టికల్స్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 2691 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకున్నారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు 2640 మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు తెలిపారు.

సామూహిక ఎలుకల నివారణ

భీమడోలు, ఫిబ్రవరి 16: మండలంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండలంలో 68 కేజీల బ్రోమోడైల్ మందును అందజేస్తున్నట్లు ఏవో ఉషారాణి తెలిపారు.

- నిడమర్రు: మండలంలో అడవికొలను, ఎనికేపల్లి, భువనపల్లి, సిద్ధాపురం, ఛానమిల్లి, బావాయిపాలెం, క్రొవ్విడి గ్రామాలలో ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టినట్లు ఏవో ఎస్.గీతాదేవి తెలిపారు.
- పెదపాడు: రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ సూచించారు.

చంద్రబాబును సీఎం చేయాలి : బడేటి


కరపత్రం అందజేస్తున్న చంటి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 16: రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. 3వ డివిజన్‌లో శుక్రవారం బడేటి చంటి పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6పథకాలు వివరించారు. ప్రజాస్పందన చూస్తుంటే జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి జాలా సుమతి, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

పెదపాడు, ఫిబ్రవరి 16: పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశంతో పార్టీతోనే సాధ్యమని అప్పనవీడుకు చెందిన టీడీపీ నాయకులు వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. అప్పనవీడులో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బెక్కం లక్ష్మీనారాయణ, వడ్డి వాసవి, పావులూరి రామారావు, గూటాల సంజీవరావు, చిన్నాల రాంబాబు, బోయపాటి దీపు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వ కుట్రలు కోర్టు తీర్పుతో బద్దలయ్యాయని దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. మండలంలో బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, తెలుగుయువత ఉపాధ్యక్షుడు మల్లిపూడి నవీన్‌తో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజధాని విషయంలో జగన్ విష ప్రచారం, అమరావతి విధ్వంసంపై సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనకు కోర్టు అనుమతించడం మంచి పరిణామం అని శేషు అన్నారు.

- బుట్టాయగూడెం: రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు ప్రారంభమైందని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజధాని కావాలని రైతులు భూములు త్యాగం చేస్తే జగన్‌రెడ్డి వారి జీవితాలతో ఆటలు ఆడుతున్నారన్నారు. ఉమ్మడి రాజధానిగా హైదరాబాదును కొనసాగించాలని వైసీపీ నాయకులు మాట్లడటం సిగ్గుచేటన్నారు.

నాచుగుంటలో జనంలోకి జనసేన

ఉంగుటూరు, ఫిబ్రవరి 16: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జనసేన, తెలుగుదేశం కూటమితోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జనంలోకి జనసేన కార్యక్రమం శుక్రవారం నాచుగుంటలో నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంది రాంబాబు, పత్తి మదన్, గేలం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** స్థానిక 26, 27, 46 డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆళ్ళ నాని శంకుస్థాపన చేశారు. మేయర్ షేక్ నూర్జహాన్, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.
- **చింతలపూడి :** చింతంపల్లిలో పేకాట స్థావరంపై దాడి జరిపి ముగ్గురిని అరెస్టు చేసినట్టు చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తెలిపారు. వారి నుంచి రూ.24,200 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.
- చింతలపూడి మండలం సుప్రియన్‌పేటకు చెందిన తగరం మధు బెంగళూరు క్రీడా పోటీలకు వెళ్లడానికి ఎయిమ్స్ సంస్థ వ్యవస్థాపకుడు సునీల్‌కుమార్ రూ.20 వేలు అందచేశారని, ఖర్చులు మొత్తం ఇస్తానని భరోసా ఇచ్చారని ఎస్.ఎస్.రాజేంద్ర తెలిపారు.
- **పెదవేగి :** వేగివాడలో వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాల కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌తో కలిసి రూ.17.58కోట్ల చెక్కును ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అందించారు.
- **టి.నరసాపురం :** కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆలయ చైర్మన్ కమ్మిల రమేష్ రాజు, బాల సూర్యనారాయణ రాజు, సర్పంచ్ సునంద ఆవిష్కరించారు.
- **పోలవరం :** పోలవరం ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటుకు సీఎం సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. ప్రత్యేక జిల్లా సాధన జేఏసీ నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు.
- **లింగపాలెం :** ములగలంపాడులో హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ సంస్థ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు మహిళలకు సర్పంచ్ రాజేష్‌బాబు కుట్టుమిషన్‌లను పంపిణీ చేశారు.
- **ఉంగుటూరు :** చోడే శ్రీనివాసరావు కుమార్తె వివాహాన్ని పురస్కరించుకుని శ్రీనివాస కళ్యాణం నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- **జీలుగుమిల్లి :** జగనన్న జలకళ పథకంలో లబ్ధిదారులకు ఎంపీపీ కొర్స పోశమ్మ ఆధ్వర్యంలో మోటార్లు, పంపుసెట్లు అందజేశారు. జడ్పీటీసీ మల్లం వసంత్, ఏపీవో జాన్‌వెస్లీ, సర్పంచ్ కుంజా పార్వతి, కె.సత్యనారాయణ, సీహెచ్.శ్రీను, సిబ్బంది దుర్గారావు, కె.శివ పాల్గొన్నారు.

పదవ తరగతి మార్కుల లిస్టు పోయినది

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, కొండ్రుకోట పంచాయితీ తెల్లవరం గ్రామ కాపురస్తులు **మాడే అనూష D/o మాడే సోమయ్య** అను నేను నాయొక్క పదవ తరగతి మార్కుల లిస్టుని పైన తెలిపిన అడ్రస్ నుండి ది.11-02-2024న ఏలూరు జిల్లా పోలవరం, పోలవరం మండలం, పోలవరం గ్రామ సెంటర్‌లో ఉన్న జిరాక్స్ షాపుకి జిరాక్స్ తీసుకునే నిమిత్తం ఆటోలో వస్తుండగా పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కావున దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు.

మాడే అనూష D/o మాడే సోమయ్య
తెల్లవరం, కొండ్రుకోట పంచాయితీ, పోలవరం మండలం, ఏలూరు జిల్లా, పిన్ నెం. 534 315, సెల్: 93913 32087.


ఏలూరులో కనకదుర్గాంబ


నిడమర్రులో సూర్యప్రభ వాహనం


పోలవరంలో పాండురంగ స్వామి


పోలవరంలో గోక్షీరాన్నం చేస్తున్న మహిళలు

వైభవంగా రథసప్తమి వేడుకలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 16: రథసప్తమి పర్వదినం సందర్భంగా శుక్రవారం జిల్లాలోని పలు ఆలయాల్లో పూజలు, సూర్యప్రభ వాహనాలపై గ్రామోత్సవం నిర్వహించారు. నగరంలోని పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద సూర్యనారాయణస్వామికి అభిషేకం చేశారు. మహిళలు సామూహికంగా పాలు పొంగించారు. సూర్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు. ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. బావిశెట్టివారిపేట కనకదుర్గాంబకు సూర్యనారాయణస్వామి అలంకారం చేశారు. పాతబస్టాండ్ సెంటర్‌లోని పాండురంగస్వామి ఆలయంలో అర్చకులు దండిబొట్ల కనకసుందర శర్మ, జంధ్యాల భరద్వాజ పూజలు నిర్వహించారు.

- పోలవరం: మండలంలో పాండురంగడి ఊరేగింపు, ఆలయాలలో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోలవరం గ్రామశివారున గరుడాద్రి పర్వతంపై పాండురంగడి ఉత్సవ విగ్రహాన్ని పూజాధికాలు నిర్వహించి దిగువన వున్న కడమ్మ ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజల అనంతరం ఊరేగించారు. పోలవరం అభయాంజనేయస్వామి, గూటాల లక్ష్మీనరసింహస్వామి, పాత పోలవరం, పట్టిసీమ వేంకటేశ్వరస్వామి, వీరేశ్వరస్వామి ఆలయాల ప్రాంగణంలో సూర్యభగవానుడు, భావన్నారాయణ స్వామికి పూజలు చేశారు.
- ఉంగుటూరు: కైకరం-అక్కుపల్లిగోకవరం మధ్య సూర్యనారాయణ స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. పరిసర గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు ఆవుపాలతో క్షీరాన్నం తయారుచేసి తీర్థప్రసాదాలుగా పంపిణీ చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.
- నిడమర్రు: బాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులతో సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి మంగళ హారతులు సమర్పించారు.
- కామవరపుకోట: స్థానిక శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితా శ్రీపీఠంలో రథసప్తమి పూజలను భక్తులు నిర్వహించారు. శ్రీచక్రానికి పాలాభిషేకం లలితాదేవి అమ్మవారికి కుంకుమార్చన చేశారు.


నూజివీడులో రైతు, కార్మిక సంఘాల నాయకుల నిరసన



కైకలూరులో అసంఘటిత రంగ కార్మికుల ర్యాలీ


ముసునూరులో కార్మికులు, సీఐటీయూ నాయకుల నిరసన


చాట్రాయిలో నిరసన ప్రదర్శన చేస్తున్న దృశ్యం

కదం తొక్కిన కార్మికులు

» ప్రభుత్వాల రైతు, కార్మిక విధానాలపై నిరసన.. » గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు కార్మిక సంఘాల పిలుపు మేరకు నూజివీడు పెద్ద గాంధీబొమ్మ సెంటర్లో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.జమలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక చట్టాలను కాలరాస్తోందని, ప్రభుత్వ రంగ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు మోదీ కట్టబెడుతున్నారన్నారు. కార్పొరేట్ సంస్థల కోసమే ప్రత్యేక చట్టాలను తీసుకు వస్తున్నారని, రైతుల భూములను లాక్కునే విధంగా, పారిశ్రామిక రంగాల్లో సమ్మె చేయకూడదనే విధానాన్ని తీసుకువస్తున్నారని విమర్శించారు. రైతుచట్టం కోసం 13 నెలలుగా ఢిల్లీలోని ప్రధాన రహదారులను అన్ని రైతు సంఘాలు నిర్బంధించడం వల్లే ప్రధాని యూటర్న్ తీసుకుని రైతు నల్లచట్టాలపై క్షమాపణలు కోరిన సందర్భాలు ఉన్నాయన్నారు. నేడు అదే స్ఫూర్తితో ప్రైవేటీకరణకు యత్నిస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులను, కార్పొరేట్ల పరం చేయటం తగదన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్, సీపీఐ (ఎంఎల్) నాయకుడు డి.హరినాథ్, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీఐటీయూ కార్యదర్శి జి.రాజు, పీఏసీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి అక్కినేని రాజా, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎం. నాగేంద్రరావు, నాయకులు ప్రకాష్, నరసింహ, సీఐటీయూ నాయకులు ఎస్‌ఆర్ హనుమాన్లు, కె.కృష్ణ, రామ్మూర్తి, బోస్, వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

ముసునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త గ్రామీణ బంద్‌లో భాగంగా శుక్రవారం ముసునూరు మెయిన్ సెంటర్లో కార్మిక, కర్షకులతో కలసి సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి అప్పుల ఊబిలో ఉన్న రైతులను రుణవిముక్తుల్ని చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనిదినాలను 200 రోజులకు పెంచి, రోజువారి వేతనం రూ.600 కూలీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు దుర్గారావు, రమేష్, వెంకటేశ్వరరావు, నాగరాజు, పోతురాజుతో పాటు కార్మికులు, కర్షకులు పాల్గొన్నారు.

చాట్రాయి: దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం చాట్రాయి సెంటర్లో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక చైతన్య వేదిక చాట్రాయి మండల కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పక్కనపెట్టి దేవుడ్ని ముందు పెట్టుకుని కేంద్రం పాలన సాగిస్తోందన్నారు. రైతు సంఘం నాయకులు కొసరాజు అబ్బులు, చాగంటి రాజారావు, టీఎన్ఎం సూరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, దుర్గం పుల్లారావు, ఓ. సుబ్బారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, యూనియన్ ఆగిరిపల్లి మండల కార్యదర్శి రాజులపాటి చంటి, సీపీఎం నాయకుడు సత్తు కోటేశ్వరరావు, డీవైఎఫ్ఐ నాయకుడు ముత్యాల నరేష్, ముఠా కార్మిక సంఘ నాయకులు బండి కోటయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు నియోజకవర్గంలో...

కైకలూరు, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేసి కార్మికుల జీవితాలను అస్తవ్యస్తం చేస్తోందని సీఐటీయూ మండల అధ్యక్షుడు కె. లాజర్ అన్నారు. శుక్రవారం గ్రామీణా భారత్ బంద్‌ను పురస్కరించుకొని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించి మాట్లాడుతూ కార్మిక సంఘాలు-సంయుక్త కిసాన్ మోర్చ అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతా పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఆహార వస్తువులపై జీఎస్టీని ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేసి ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలి, ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం, ప్రైవేటు పరం చేయడం నిలుపుదల చేయాలని, అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని, ఉపాధి పథకాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పి. సుజాత, విజిత, ఝాన్సీ ఆశావర్కర్లు, పి. ప్రమీల, షేక్ చాన్‌మా, పి. శివకుమారి, కె. దెబోరా, బి. నాగమణి, స్కూల్ స్వీపర్లు జి. స్వాతి, కుమారి, ఎస్తేరు రాణి, మధ్యాహ్న భోజన యూనియన్ కార్మికులు పి. ప్రమీల, వాణి తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు అంగన్‌వాడీల సంఘీభావం

ముదినేపల్లి: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్వహించిన గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతుగా ముదినేపల్లిలో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ప్రతినిధి మాధవ్, అసోసియేషన్ ముదినేపల్లి మండల శాఖ అధ్యక్షురాలు సూరపనేని అరుణ కుమారి, నాయకులు సొంగా మణి, బండి పద్మ, రిబ్ కా తదితర నాయకత్వంలో బంద్‌కు సంఘీభావంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు.

కలిదిండి: కేంద్రం విధానాలను నిరసిస్తూ గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా కలిదిండిలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కలిదిండి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సు లకు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధర, ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. అన్ని రకాల ఆహార ఉత్పత్తులపై జీఎస్టీ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు వి.భాస్కరరావు, జ్ఞానేషు, రమాదేవి, మహాలక్ష్మి, సత్యవతి, వరలక్ష్మి, విజయలక్ష్మి, కె.శ్రీనివాసరావు, సీహెచ్ సత్య నారాయణ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, వ్యవసాయ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, ఆశా వర్కర్లు మండవల్లిలో శుక్రవారం ధర్నా, ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండవల్లి ప్రధాన సెంటర్లో మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు నాజర్, ఆశావర్కర్లు, యూనియన్ నాయకురాలు గీతాంజలి, అంగన్వాడీ టీచర్ల సంఘం నాయకురాలు చెల్లమ్మ, ఉమాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.


ఆగిరిపల్లిలో నిరసన


ముదినేపల్లిలో అంగన్‌వాడీల నిరసన


కలిదిండిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



మండవల్లిలో అంగన్వాడీ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు



పెద్దకొరాయిలో రథసప్తమి వేడుకలు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా శుక్రవారం ఉదయం 5 గంటలకు పెద్దకొరాయిలో తేరు గరుడ సేవ నిర్వహించారు. శ్రీ మహావిష్ణువు వాహనమైన గరుడవాహనం నుంచి తేరు (రథం) వాహనం మీదికి స్వామివారిని మార్చుటకు అనుమతి కోరుతూ నివేదన జరిపే విధానమే తేరుగరుడ సేవ. ఈ ప్రక్రియ అనంతరం స్వామివారి దిగువ సన్నిధికి వేంచేసి అమ్మవార్లతో కల్యాణం జరిపించారు. కైంకర్య పరులుగా చింతపట్ల సత్య నారాయణ దంపతులు పాల్గొన్నారు. రాత్రి 6 గంటలకు కల్పవృక్షవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 8 గంటలకు ఎదురు కోలోత్సవం జరిగింది. 9 గంటలకు స్వామివారికి గోదా అమ్మవార్లకు దివ్య తిరుకల్యాణం, రాధాకృష్ణ కల్యాణం, కోట్నాల సేవ, ఊంజల సేవ జరిగింది.


శ్యామలాంబ ఆలయంలో భక్తుల రథసప్తమి పూజలు

సారిక శ్యామలగా శ్రీశ్యామలాంబ

కైకలూరు, ఫిబ్రవరి 16: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి నవరాత్రుల సందర్భంగా శుక్రవారం అమ్మవారు సారికి శ్యామలాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ గుర్రం రాంబాబు దంపతులు ఉభయదాతల పూజలను నిర్వహించారు. అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రథసప్తమి సందర్భంగా శ్రీశ్యామలాంబ, మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేదపండితుడు లంకా ఫణికుమార్ శర్మ సూర్య నమస్కారాలు, ప్రత్యేక హోమపూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాన్ని అందజేయగా ఆలయ అధికారి వీఎన్‌కె శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గీతామందిరంలో రథసప్తమి వేడుకలు

కైకలూరు, ఫిబ్రవరి 16: కైకలూరు గీతా మందిరంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు దంపతులు పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. కమిటీ సభ్యులు వేగిరెడ్డి నారాయణరావు, కడగళ్ళ సత్యం నాయుడు, కామినేని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామికి పూజలు



మండవల్లి, ఫిబ్రవరి 16: మండవల్లి శ్రీనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ పర్యవేక్షణలో ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆంజనేయ స్వామికి తమల పాకుల అర్చన, గంధ సింధూరం పూజ జరిగాయి. హనుమాన్ జంక్షన్ నుంచి ప్రత్యేక వాహనంలో విచ్చేసిన స్వామివారి ఉత్సవ విగ్రహానికి ఈవో దివ్య ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం అర్చకుడు గూడూరు శ్రీనివాసరావు పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులతో స్వామివారికి తమలపాకుల పూజ చేయించారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వద్దు

» మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ

» చెరువులు నింపే వరకు వంతు ఇవ్వాలన్న సర్పంచ్‌లు


మాట్లాడుతున్న ఎంపీపీ

కలిదిండి, ఫిబ్రవరి 16 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వర రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడు తూ అడుగంటిన తాగునీటి చెరువులను నింపటానికి సీబీ కెనాల్‌కు నీటి వంతు తగు మోతాదులో రాకపోవటంతో లంక గ్రామాల తాగునీటి చెరువులకు నీటి వంతు వెళ్లటం లేదన్నారు. గుర్వాయిపాలెం - పెదలంక కాల్వలో గుర్రపు డెక్క, తూడు దట్టంగా ఉండటంతో నీరు పారటం లేదని వెంటనే డెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టాలన్నారు. వెంకటాపురం తాగునీటి చెరువును పూర్తిస్థాయిలో నింపటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. లంక గ్రామాలైన సంతోషపురం, భాస్కరరావుపేట, మూల్లంక, పెదలంక గ్రామాల్లో తాగునీటి చెరువులు అడుగంటాయని, వాటిని కూడా నింపటానికి సీబీ కెనాల్‌కు నీటి వంతు తగు మోతాదులో ఇవ్వాలన్నారు. తాగునీటి చెరువులను నింపే వరకు నీటి వంతు ఇస్తేనే తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపటం సాధ్యమవుతుందని, చెరువులు నింపే వరకు తాగునీటి వంతు ఇవ్వాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. జడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీలు కనక దుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, ఎంపీడీవో దినతేజ్, ఈవోపీఆర్డీ రాజారావు పాల్గొన్నారు.

రాజకీయాలకు స్వస్తి : కాపా



నూజివీడు, ఫిబ్రవరి 16: ఈ రోజు నుంచి తాను రాజకీయాలకు స్వస్తి చెబుతున్నట్లు నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, తెలుగు దేశం పార్టీ నాయకుడు కాపా శ్రీనివాసరావు శుక్రవారం సంచలన ప్రకటన చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తనపై నిరాధార ఆరోపలు, అసభ్య పదజాలంతో తనపై, తన కుటుంబీకులపై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వ్యక్తులను, ప్రోత్సహిస్తున్న స్థానిక టీడీపీ ఇన్‌చార్జ్‌లు, నాయకుల వ్యవహార శైలిని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్ళినా వారిని అదుపుచేయలేని పార్టీ వ్యవహార శైలికి మనస్తాపం చెంది ఈ రాజకీయాల్లో తాను ఇమడలేనని భావించి రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయిం చుకున్నట్లు తెలిపారు. నాడు ముద్దరబోయిన ఓటమికి తనపై అభాండాలు వేశారు. ఇప్పుడు పార్థసారథికి పార్టీ టిక్కెట్ ఇస్తోంది. నూజివీడులో లోకల్, నాన్ లోకల్ అనే వ్యత్యాసం బాగా ఉంది. ఈ నేపథ్యంలో ఒక వేళ టీడీపీ స్థాని కంగా మరోసారి పరాజయం పాలైతే ఆ నింద భరించే శక్తి తనకు లేదని కాపా గద్గద స్వరంతో అన్నారు. ఇప్పటి వరకు కుటుంబం పట్ల నిర్లక్ష్యం వహించి, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించానని, పదవులను ఆశించలేదన్నారు. అయినా తనకు పార్టీలో అవమానాలు జరుగుతున్నాయన్నారు.

కాపాను కలసిన సారథి..?

కాపా నిర్ణయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శుక్రవారం సాయంత్రం రావిచర్ల గ్రామంలో కాపా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి ఆయనను బుజ్జగించినట్లు సమాచారం. కాపా నిర్ణయం పట్ల పార్టీ అధిష్ఠానం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.


నూజివీడులో ప్రభుత్వ కార్యాలయం వద్ద ఎన్జీవోల నిరసన


ముదినేపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

ఆగని ఉద్యోగుల నిరసనలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 16: పీఆర్సీ బకాయిలను తక్షణం చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 14 నుంచి డిమాండ్ల సాధన కోసం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతున్న ఏపీ ఎన్జీవోలు, ఇతర ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.6,700 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎన్జీవో నాయకులు డిమాండ్ చేశారు. వివిధ కార్యాలయాల వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమాల్లో ఏపీ జేఏసీ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, ఎన్జీవోల సంఘం కార్యదర్శి పి.శ్రీనివాస్‌బాబు, రాజబాబు, సందీప్, రవి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పెన్షనర్లు పాల్గొన్నారు. కాగా శనివారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ముదినేపల్లి, ఫిబ్రవరి 16 : తమ డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగుల నిరసన కొనసాగుతోంది. ముదినేపల్లి మండలంలోని ఏపీ ఎన్జీవోలు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతూ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందంటూ భోజన విరామ సమయంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏపీఎన్జీవోల సంఘం మండవల్లి యూనిట్ అధ్యక్షుడు ఎం.వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో మండల పరిషత్తు కార్యాలయ ఏవో రమణబాబు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గిరిజ, ప్రదీప్ తదితరులు నల్లబ్యాడ్జీలతో ప్రదర్శన నిర్వహించారు.


ప్రహరీ గోడ లేని కోరుకొల్లు జడ్పీ హైస్కూల్

60 ఏళ్లుగా ప్రహరీ లేదు

» కోరుకొల్లు జడ్పీ హైస్కూల్ తీరిది

కలిదిండి, ఫిబ్రవరి 16: కోరుకొల్లు జడ్పీ హైస్కూల్‌కి ప్రహరీ గోడ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 60 ఏళ్ల పూర్తి చేసుకున్న జడ్పీ హైస్కూల్‌కు ఇంత వరకు ప్రహరీ నిర్మించకపోవటంతో రాత్రి పూట ఆవరణలో మందు బాబులు మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. నాడు - నేడు పనులకు సంబంధించిన సామగ్రి ఆరుబయట ఉండటంతో రక్షణ లేక కొంత సామగ్రి అపహరణకు గురైనట్టు సమాచారం. నాడు - నేడు పనుల్లోను ప్రహరీ నిర్మాణం లేక పోవ డంతో అధికారులకు, పాలకులకు పలుమార్లు విన్నవించినా పట్టిం చుకోవటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి కైనా ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎర్రగుంట మృతికి ముద్దరబోయిన, కొలుసు నివాళి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 16: నెక్కలం గొల్లగూడెం గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు ఎర్రగుంట భాగ్యరాజు శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఆయన వారి పార్థివ దేహానికి నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, పార్టీ జెండాను కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి భాగ్యరాజు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నూజివీడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, నెక్కలం గొల్లగూడెం మాజీ సర్పంచ్ నరదల సాంబశివరావు, తాడిబోయిన సత్యనారాయణ, లోయ నాగరాజు, నరదల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. వడ్లమాను సర్పంచ్ జలసూత్రం వంశీ బంధువు శోభనాద్రి అకాల మరణాన్ని తెలుసుకుని పార్థసారధి వారి కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు జలసూత్రం నోజారావు, సాదం గోపి, గోళ్ళ రాజు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయం.. ఒకరి అరెస్టు

ముసునూరు, ఫిబ్రవరి 16: మండలంలోని కొర్లకుంటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని శుక్రవారం ముసునూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుడైన చౌటపల్లి ప్రసాద్‌రావు ఇంటివద్దే అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని అందిన సమాచారంతో ఎస్సై పి.వాసు తన సిబ్బందితో దాడి చేశారు. 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడు ప్రసాద్‌రావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని నూజివీడు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

నేడు ముద్దరబోయిన ఆత్మీయ సమావేశం

నూజివీడు, ఫిబ్రవరి 16: నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటలకు టీడీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

వేణుగోపాలుడికి చిన్నం పూజలు



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 16: రథసప్తమిని పురస్కరించుకుని నూజివీడు వేణుగోపాలస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురాతన సత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు గుడిపూడి రాఘవకుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

జనసేన - టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

ముదినేపల్లి, ఫిబ్రవరి 16 : ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో జనసేన - టీడీపీ కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని దక్షిణ భారత కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పండలనేని గోపాల్ అన్నారు. రానున్న ఎన్నికలు కీలకమైనవని, రాష్ట్రానికి మంచి భవిష్యత్తు కావాలంటే జనసేన - టీడీపీ కూటమిని గెలిపించాలన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా యువత వ్యవహరించాలని కోరారు. అధికార వైసీపీ నాయకులు జనసేన-టీడీపీ మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఏపీలో పరిశ్రమల స్థాపన, ఐటీ రంగం అభివృద్ధిని వైసీపీ మరచిందని గోపాల్ విమర్శించారు.


మాట్లాడుతున్న ఎంవీఐ నాగమురళి

మద్యం సేవించి వాహనం నడిపితే జైలే

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 16: మద్యం సేవించి వాహనం నడిపే వారి లైసెన్స్ రద్దుచేయడంతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుందని, నూజివీడు ఎంవీఐ జి.నాగమురళీ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నూజివీడు ఎంవీఐ కార్యాలయంలో రోడ్డుభద్రతపై విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు, నూతన లైసెన్స్ దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేట ప్పుడు రహదారి నిబంధనలు పాటించాలన్నారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 16: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో నూజివీడు బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ సత్యనారాయణ తెలిపారు. సీహెచ్ నిఖిల ప్రథమ, వర్షిణి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో వీరు బహుమతులను అందుకోనున్నట్లు వివరించారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి : సర్పంచ్

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 16: పెదపాలపర్రు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శాంతకుమారిని తక్షణం విధుల నుంచి సస్పెండ్ చేయాలని సర్పంచ్ గంటా రాకేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆమెపై డీఈవో, జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తే షోకాజ్ నోటీసు జారీచేసి తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషిస్తోందని, ఆమె విధులకు హాజరైతే గ్రామంలోని విద్యార్థులు ఎవరూ పాఠశాలకు రారని సర్పంచ్ హెచ్చరించారు. నూతనంగా వచ్చిన విద్యాశాఖ అధికారి దీనిపై పూర్తిస్థాయిలో విచారించి రెండు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే పాఠశాల ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డియ్య చౌదరి మృతి



ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని గురజ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఎర్నేని వెంకట రెడ్డియ్య చౌదరి (78) గురువారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెడ్డియ్య చౌదరి మృతి పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, కొడాలి వినోద్, అడుసుమిల్లి రామకృష్ణ, రాములు తదితరులు సంతాపం తెలిపారు.